ముమ్మరంగా పొగాకు గ్రేడింగ్

- 24 నుంచి అమ్మకాలకు బేళ్లు సిద్ధం
- ఐదు గ్రేడులుగా పొగాకు విభజన
- తగ్గిన లో గ్రేడు శాతం
- ఆశాజనకంగా రంగులు


దేవరపల్లి మండలం బుచ్చియపాలెంలో పొగాకు గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

దేవరపల్లి: పొగాకు క్యూరింగ్‌లు చివరి దశకు చేరుకోవడంతో గ్రేడింగ్‌లు ముమ్మరంగా జరుగుతున్నాయి. క్యూరింగ్ చేసిన పొగాకును రైతులు గిడ్డంగుల్లో మండెలు వేసి తేమ శాతం పెరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మండెల్లో ఉన్న పొగాకును ఐదు రకాల గ్రేడులుగా విభజించి బేళ్లు తయారు చేస్తున్నారు. 1,2,3 నంబర్ల గ్రేడులతో పాటు గ్రీన్, మాడు రకాలుగా గ్రేడింగ్ చేస్తున్నారు. గ్రేడ్ చేసిన పొగాకును బేళ్లుగా తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఒక్కొక్క బేలు 150 కిలోలకు మించకుండా బేళ్లు తయారు చేస్తున్నారు.

తూకం తగ్గే అవకాశం

ఈ ఏడాది రంగు, నాణ్యత బాగుండడంతో లో గ్రేడు శాతం తక్కువగా ఉందని రైతులు తెలిపారు. 2022–23 సీజన్‌లో లోగ్రేడు పొగాకు 20 నుంచి 25 శాతం ఉత్పత్తి కాగా, 2023–24 సీజన్‌లో 20 శాతం ఉత్పత్తి జరిగింది. 2022–23 ఏడాది మార్కెట్లో లో గ్రేడు పొగాకుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడడంతో గిట్టుబాటు ధర లభించింది. 2023–24 ఏడాది మార్కెట్లో వేలం ప్రారంభంలో లో గ్రేడుకు మంచి ధర లభించినప్పటికీ చాలామంది రైతులు సకాలంలో అమ్ముకోలేక పోయారు. అమ్మకాల ముగింపు సమయంలో మార్కెట్లో లో గ్రేడుకు డిమాండ్ లేకపోవడంతో రైతులు తక్కువ ధరకు అమ్మకోవలసి వచ్చింది. ఈ ఏడాది పొగాకు రంగు, నాణ్యత ఆశాజనకంగా ఉండడంతో లో గ్రేడు పొగాకు 10 శాతం ఉంటుందని రైతులు అంటున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తోటలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఆకులు తోడుకోలేదని, దీనివల్ల గుల్లబారి తూకం తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.


గ్రేడింగ్ చేసిన పొగాకును బేళ్లు కడుతున్న రైతులు


అమ్మకానికి సిద్ధం చేసిన పొగాకు బేళ్లు

24 నుంచి పొగాకు కొనుగోలు

2024–25 పంట కాలానికి రైతులు పండించిన పొగాకును ఈ నెల 24 నుంచి కొనుగోలు చేయడానికి బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు వేలం కేంద్రాల వారీగా రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, గ్రేడింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించి అవగాహన కల్పిస్తున్నారు. ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2024–25 పంట కాలానికి 12487 మంది రైతులు 28,719 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు.

అన్య పదార్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలి



పొగాకు గ్రేడింగ్ సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పొగాకులో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టిక్ ముక్కలు, పురికొస ముక్కలు, సిగరెట్ ముక్కలు, బీడీ ముక్కలు, గాజు ముక్కలు వంటి అన్య పదార్థాలు ఉండరాదు. అన్య పదార్థాల వల్ల ఎగుమతులపై ప్రభావం పడుతుంది. గ్రేడింగ్ చేసిన పొగాకులో తేమ శాతం సరిచూసుకుని బేళ్లు తయారు చేసుకోవాలి. పొగాకు మండెలను ఎప్పటికప్పుడు తిరగవేసుకోవాలి. 150 కిలోలకు మించి బేలు తయారు చేయవద్దు. మంచి గ్రేడుకు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. పొగాకు రంగులు, నాణ్యత బాగుంది.

– జీఎల్‌కే ప్రసాద్, రీజనల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

చెత్త నుంచి ఎరువు తయారీ


పెద్దేవంలో చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ విధానం తెలుపుతున్న కార్యదర్శి

తాళ్లపూడి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుధ్యానికి ఇబ్బంది లేకుండా గ్రామంలోని ఇంటింటి నుంచి తడి చెత్త, పొడి చెత్తలను సేకరించి దాని నుంచి సంపద సృష్టించడంలో భాగంగా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తామని పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి తెలిపారు. మండలంలోని పెద్దేవం పంచాయతీలో ఉపసర్పంచ్ తోట రామకృష్ణతో కలసి పారిశుధ్య పనులను గురువారం పరిశీలించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ


ప్రకాశరావుపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో రూ.కోటి 50లక్షలతో నిర్మించనున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. తేతలికి చెందిన వేద పండితులు శశికాంత్ ఆధ్వర్యంలో పూజాదికాలు చేశారు. యద్దనపూడి బ్రహ్మరాజు, కరుటూరి అచ్యుతరామారావు, బోయపాటి గంగరాజు(పెదబుజ్జి) దంపతులు పూజలు నిర్వహించారు.

మున్సిపల్ అధికారులకు సత్కారం


మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, అధికారులను సత్కరిస్తున్న సభ్యులు

నిడదవోలు : స్థానిక మదనగోపాలస్వామి ఆలయంలో నిడదవోలు వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మున్సిపల్ మహిళా అధికారులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ మేనేజర్ శారదాదేవి, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ, మున్సిపల్ రెవెన్యూ అధికారి నాగకుమారిలను సత్కరించి క్లబ్ తరపున కానుకలు అందజేశారు. డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి కేదారశెట్టి సునీత, పెరుమాళ్ళ విజయలక్ష్మి, వనితాక్లబ్ అధ్యక్షురాలు గొల్లపూడి గాయత్రి, కార్యదర్శి జవ్వాది శిరీష, కోశాధికారి ఉదయగిరి మణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.11 లక్షలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి హుండీని గురువారం లెక్కించామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా రూ.4,03,875 వచ్చిందని, అన్నదాన హుండీ ద్వారా రూ.8,104 లు మొత్తం ఆదాయం రూ.4,11,979 వచ్చిందని ఈ ఆదాయం 43 రోజులకు అని తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి పీవీ సుబ్రహ్మణ్యం సమక్షంలో గ్రామ పెద్దలు పంతం చిన్న, పప్పొప్పు నాగేశ్వరరావు (పీఎస్) పంతం నాగేశ్వరరావు, రంగనీటి కట్లయ్య, ఓసూరి బాల నాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో మహిళా రక్షక్ కార్యక్రమం

గోపాలపురం: సమాజంలో మహిళల ప్రాధాన్యం, నూతన చట్టాలు, మహిళా రక్షణ వంటి అంశాలపై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ అన్నారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ వద్ద గురువారం హైస్కూల్ విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై సతీష్‌కుమార్ మహిళలు, బాలికలు, వృద్ధులు తమను తాము ఎలా రక్షించుకోవాలన్న అంశంపై వివరించారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

కొవ్వూరు: ప్రతీ రైతు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, కావాల్సిన ఇతర సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధరరావు సూచించారు. పట్టణంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టం ప్రాముఖ్యత, నియమ, నిబంధనలు గురించి ఆయన వివరించారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణ ప్రియ, ఉద్యాన, వ్యవసాయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఉత్సవాలు ప్రారంభం


గోపాలపురం మండలం భీమోలులో వెలసిన పెద్దింట్లమ్మ తల్లి

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామ శివారు పెద్ద చెరువు వద్ద వెలసిన పెద్దింట్లమ్మ తల్లి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భీమోలు, గుడ్డిగూడెం, గోపాలపురం గ్రామాల నుంచి భక్తులు వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త సి.చినరామారావు ఆధ్వర్యంలో కందగిరి గౌతమ్ శర్మ పూజలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఉండ్రాజవరం : రామాలయం వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని వెలగదుర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం కనులపండువగా నిర్వహించారు. ముందుగా వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్ల ఊరేగింపును చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

శాస్త్రవేత్తల బృందం వరి చేల పరిశీలన


మలకపల్లిలో రబీ వరి చేలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

తాళ్లపూడి: ప్రస్తుత దాళ్వా వరి పంటలో ఇటీవల కల్తీ విత్తనాలు వేసిన పంట పరిస్థితి, వరి రకాలు, చీడపీడల ఉధృతి వంటి విషయాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మండలంలోని మలకపల్లిలోని దాళ్వా వరి చేలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు శాస్త్రవేత్తలు, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ ఎం.సుధారాణి, డాక్టర్ వి.రోజా తదితరులు రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు వారితో రబీలో వరిలో కల్తీ విత్తనాల కారణంగా నాలుగు రకాలు వరకు రకాలు ఉన్నాయని పంట దిగుబడి కూడా తగ్గినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ మలకపల్లిలో వరి రకం పి.ఆర్. 126 లో వచ్చిన ఫిర్యాదు మేరకు శాస్త్రవేత్తల బృందం వరి పంటను పరిశీలించి, విశ్లేషణ కోసం నమూనాలను సేకరించామని, ప్రయోగశాలలో పరిశీలించి నివేదికను సమర్పిస్తామని తెలియజేశారు. ప్రస్తుతం దాళ్వా వరి పంట, పాలు పోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉందన్నారు. మండలంలో దాళ్వా వరి పంట ఆరోగ్యంగా ఉన్నదని, చీడపీడల సమస్య లేదని, పంట దిగుబడి ఆశాజనకంగా ఉందనీ తెలియజేశారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా, వరిలో కంకినల్లి ఆశించే అవకాశం ఉందని, రైతులు కంకినల్లిని గమనిస్తే, స్పైరో మెసిఫిన్ 200 మిల్లి లీటర్లు ఎకరానికి చొప్పున పిచికారీ చేయవలసిందిగా సూచించారు. వారి వెంట కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీఏ పి.చంద్రశేఖర రావు, ఏడీఏ, డి ఆర్ సి ఎస్. జయ రామలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి జి.రుచిత , గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

ఇసుక ర్యాంపుల ఏర్పాటుపై ఫిర్యాదు


తహసీల్దార్ మోహన భారతికి వినతి పత్రాన్ని ఇస్తున్న మండల బీజేపీ నాయకులు

తాళ్లపూడి: ఇసుక ర్యాంపుల కోసం మండలంలో ఏటిగట్లను ఇష్టానుసారంగా ఎవరికి వారు, ఎక్కడ పడితే అక్కడ జేసీబీ లతో తవ్వేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ ఆరోపించారు. గురువారం మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపుల నుంచి భవిష్యత్‌లో వచ్చే ముప్పు నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ తహసీల్దార్ మోహన భారతికి వినతి పత్రాన్ని అందజేశారు. ర్యాంపులకు గట్లు తవ్వేందుకు పర్మిషన్ ఎలా ఇస్తున్నారని, దీని ప్రభావంతో రానున్న గోదావరి వరదలకు ఏటిగట్టు పటిష్టత దెబ్బతిని గట్టు మొత్తం గండ్లు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల ఆస్తి ప్రాణ నష్టం కలుగుతుందని, ఏటిగట్టుపై అధిక లోడుతో తిరిగే లారీల రాకపోకలపై నియంత్రణ లేదని అన్నారు. అనుమతులు లేని ఇసుక రీచ్ లను నిలుపుదల చేయాలని, ఇసుక డ్రెడ్జింగ్ కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కొమిరెడ్డి శ్రీనివాసులు, కలిసేట్టి సన్యాసినాయుడు, వెలుగబండి బాలకృష్ణ, పడిందల లింగాచారి, గోకవరపు జితేంద్ర రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బట్టు రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి


చాగల్లులో ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

చాగల్లు: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం చాగల్లులో మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మండల సమగ్రశిక్ష ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, తమకు కూడా ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, జీతాలు పెంపుదల చేయాలని, ఉద్యోగ విరమణ అనంతరం గ్రాట్యూటీ అమలు కోరుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగుల తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ వీర వెంకటరావు, కంప్యూటర్ ఆపరేటర్ గణేష్ , ఎంఐఎస్ కోఆర్డినేటర్ గీత భవానీ, సీఆర్పీలు రాజేష్, సంధ్య, స్వరూప, పి.టి.ఐ వల్లి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ యర్నగూడెం ఇండస్ట్రియల్ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పని కోసం, త్యాజంపూడి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కురుకూరు ఫీడర్‌లో ట్రీ కటింగ్ కోసం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. యర్నగూడెం ఇండస్ట్రీయల్ ఫీడర్, త్యాజంపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని కురుకూరు ఫీడర్‌పై గల గృహ, వాణిజ్య, ఇండస్ట్రీయల్, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కురుకూరు ఫీడర్‌పై గల వ్యవసాయ వినియోగదారులకు త్రీ ఫేజ్ సరఫరా ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఇవ్వనున్నట్టు చెప్పారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం, మోర్త విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కోసం మండలంలో ఉండ్రాజవరం, సత్యవాడ, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు.

కొవ్వూరు: దేచెర్ల సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు విద్యుత్ శాఖ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఐ.పంగిడి ఇండస్ట్రియల్ ఏరియా, 11కేవీ ఏరియా, ఐ.పంగిడి వాటర్ వర్క్స్ ఫీడర్‌లకు దేచెర్ల సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఐ.పంగిడి, దేచెర్ల గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నిడదవోలు : పట్టణంలో 11 కేవీ టౌన్–2 విద్యుత్ ఫీడర్ మరమ్మతులు, చెట్ల నరికివేత పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలో మెయిన్ రోడ్, గణేష్ చౌక్, గణపతి సెంటర్, యర్నగూడెం రోడ్, శాంతినగర్, వైఎస్సార్ నగర్, జగనన్న కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

అక్రమ నిర్బంధంపై నిరసన


దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

దేవరపల్లి: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్నవారిని మార్గమధ్యలో నిర్బంధించడంపై ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆశా వర్కర్ల పోరాటంపై ప్రభుత్వ అణచివేత సిగ్గుసిగ్గు అని ఆశా వర్కర్లు పేర్కొన్నారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భగత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం దుర్మార్గంగా ఆపాలని ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆశా వర్కర్ల కోర్కెలు న్యాయబద్ధమైనవేని, అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్టు ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పట్టించుకోకపోగా, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేమని చెబుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనాలను అమలు చేసి రూ.26 వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని, వివిధ సర్వేల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. సీఐటీయూ నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు తొర్లపాటి ఇందిర, టి.మోదమ్మ, ఎ. ప్రసన్న, కె.సత్యవతి, ఆర్.భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధంలో ఉన్న పలువురు ఆశా వర్కర్లను విడుదల చేశారు.

ఆశ వర్కర్లను అడ్డగించిన పోలీసులు


నల్లజర్లలో ఆశా వర్కర్లను అడ్డుకున్న పోలీసులు

నల్లజర్ల: ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు మధ్యలోనే అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తరలించుకుపోయారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత సమ్మెకాలంలో ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాలపై జీఓ విడుదల చేయాలని కోరుతూ ఆశ వర్కర్లు గురువారం చలో విజయవాడకు బయలు దేరారు. వీరందర్నీ వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేసే వరకు పోరాటం ఆపేది లేదని ఆశ వర్కర్లు చెబుతున్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

కొవ్వూరు: ఆశా వర్కర్లకు కనీస వేతన ఒప్పందం జీవోల విడుదల చేసి, కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ విజయవాడ బయలుదేరిన ఆశా వర్కర్లను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పేర్కొన్నారు. ఏపీ ఆశా వర్కర్లు యూనియన్ సీఐటీయు అనుబంధ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆశా వర్కర్లు విజయవాడ బయలుదేరారన్నారు. వీరికి కనీసం వేతనాలు కల్పించి ఉద్యోగ్య భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

8 నుంచి పేదలపై సర్వే


పి- 4 సర్వేపై నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

తాళ్లపూడి: మండలంలోని గ్రామాల్లో పేదవారిలో పేదవారు ఎవరు అనే వివరాలతో సర్వే చేస్తామని ఎంపీడీవో టిబీ వెంకట రమణ తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య సర్వే (పి.4) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట రమణ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 18వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. సచివాలయం సిబ్బంది మొత్తం ఈ సర్వే నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా పేదవారిలో పేదవారు ఎవరు అనేది గుర్తిస్తారు అని చెప్పారు. పేదలకు సాయం అందించగలరాఅని ధనికులను అడిగే ప్రశ్నావళి ఉంటుంది అని అన్నారు. ట్రైనర్ ప్రసాద్ మాట్లాడుతూ 27 రకాల ప్రశ్నావళి ఉంటుంది అని ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేయాలి అని అన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న త్రినాథస్వామి తదితరులు

తాళ్లపూడి: గోదావరిలో స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన తాడిపూడి గ్రామానికి చెందిన పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్త సాయి, అనిశెట్టి పవన్ గణేష్, గర్రే ఆకాష్, తిరుమలశెట్టి పవన్ కుమార్‌ల కుటుంబ సభ్యులకు గురువారం తాళ్లపూడిలోని కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యాసంస్థల చైర్మన్ కరిబండి గనిరాజు, డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి, సెక్రటరీ కరిబండి సర్వా రాయుడుల ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. మృతుల కుటుంబాలకు తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. అన్నదేవరపేటకు చెందిన జనసేన నాయకుడు చేవూరి బంగారాజు, చేవూరి రాములు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుల కుటుంబాలను గురువారం టీడీపీ నాయకుడు ఎస్.రాజీవ్ కృష్ణ పరామర్శించారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

చాగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చాగల్లులో రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ ఎం.మెరికమ్మకు మండల రైతు సంఘం నాయకులు కంకటాల బుద్దుడు, గారపాటి వెంకట సుబ్బారావు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. కేంద్రం 2021లో ఢిల్లీలో రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఎస్.కె.ఎం. నాయకత్వానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం

నిడదవోలు : పట్టణంలో ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్త్రీలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆసుపత్రి వైద్య బృందం అత్యంత ఖరీదైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన క్యాన్సర్ నిర్ధారణ మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా ప్రత్యేక క్యాన్సర్ నిపుణులతో నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారని ఆమే పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీలకు గర్భాశయ పరీక్షలు, రొమ్ము పరీక్షలు, ఉదర పరీక్షలతో పాటు ఊపిరితిత్తులకు ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తారు. 40 ఏళ్లు పైబడిన వారందరూ మెడికల్ రిపోర్టులతో పాటు తెలుపు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రిన్సిపల్ జ్యోతి పేర్కొన్నారు.

శలాకకు ప్రతిష్టాత్మక పురస్కారం


శలాక రఘునాథశర్మ

సీటీఆర్ఐ: మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత ప్రాచార్య శలాక రఘునాథ శర్మ మరో పురస్కారానికి ఎంపిక అయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శాంతా బయోటెక్ సంస్థ అధినేత డాక్టర్ కె.వరప్రసాద రెడ్డి స్థాపించిన శాంతా వసంత ట్రస్టు ఆధ్వర్యంలో అందించే వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ తిలక్ రోడ్డులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 9న జరిగే కార్యక్రమంలో ఆయన పురస్కారం ప్రదానం చేస్తారు.